విక్రమార్కుడి సింహాసనము



"సార్. వరహాలరాజూ సార్...."

'ఎవరది' అన్నాడు సోఫామీద తలవాల్చి కన్నులరమోడ్చి కూర్చున్న వరహాల రాజు; నరసుమీదనుంచి చూపుతీసి, వచ్చిన పెద్దమనిషి కేసి తిప్పడానికి ప్రయత్నిస్తూ. ఎంత ప్రయత్నించినా, నున్నటి మెత్తటి పట్టుచీర మీద అది ఆమె మెడదాకా జరిగి తిరిగి జారిపడిపోతోంది. నరసు బద్ధకంగా నవ్వి మెల్లిగా మునివేళ్ళతో అతని గడ్డం పట్టుకుని తలపైకెత్తి అటువైపు తిప్పింది.

థాంక్యూ. 'డాళింగ్' అన్నాడు రాజు ముక్కు పుటాలు ఎగరేసి అటు చూడబోయి.

రాజు ఆ వచ్చిన మనిషికేసి వింతగా చూశాడు.

"మల్లీ ఇటు సూడమాక జారిపడేవు" అంది నరసు కేరుతూ నవ్వి.

"యస్; ఎవరు మీరు? సినిమా ఛాన్సుకోసం వచ్చారా? సారీ. నో ఛాన్స్. న్యూటాలంట్లకి సినిమా స్కోపు లేదు."

"మీ కొత్తవాళ్లతో రిస్కు. డబ్బుగిట్టదు. అవస్థ. ఒళ్లొంచి పని చేస్కోరాదూ. పెతివాడూ సినిమాలో చేరతాననకపోతే. మా ప్రాణాలు పీకి లాభం ఏమిటి .... వాట్ నర్సూ—యామై రైట్స్? .... అందరూ సినిమా తీస్తే చూసేవాడెవడు. హహ్హహ్హా" అన్నాడు.

"నూసుపేపరాడో యేటో. సిత్తరంగా సూత్తన్నాడు మనకాసి. కసింత ఒల్లు దెగ్గిరెట్టక మాటాడు బుల్లోడా!" అంది నరసు మెల్లిగా.

రాజు నిటారుగా లేచి కూచున్నాడు.

"సిడౌన్ సర్. రాఫిలిం ట్రబుల్. తరవాత, అయి వాంట్ పీసు డోంట్ వాంట్ వార్ సార్ ....నా అభిమాన రచయిత వరహాలరాజు. అభిమాన ప్రొడ్యూసరు కూడా వరహాలరాజేనండి. అభిమాననటి, ఇగో, మా నరసు. డైరెక్టరు ఇంకాలేదు. అభిమానసాంగ్సు రైటరేమో వి. రాజు.... ఇంకా, ఇంకేం కావాలి. గ్రేటెస్ట్ యాక్టర్ల పేర్లు....ఇపుడే కాదులెండి. రేపురండి. కాంట్రాక్టులు రేపు సంతకాలవుతాయి. అపుడు టెలిఫోన్ కొడతాను .... రాసుకోరేం ఇవన్నీ? పెన్నూ కాయితం తెచ్చుకోలేదా? ఏవి నూసుపేపరయ్యా? నీది."

ఆవచ్చిన పెద్దమనిషి వెనక్కిచూశాడు. ఎవరూలేరు.

'మీరు తిడుతున్నది నన్నే?' అన్నాడు.

'నిన్నే. నువు పేపర్లవాడివి కాదా?'

'కాదు'

'అయితే నేనూ కాదు'

'మీరు పేపరు వాడని నేను అనలేదండి'

'అదికాదు. నేను ఇందాక నించీ నీతో మాటాట్టం లేదూ అంటున్నా'

'మరి ఎవరితో మాటాడుతున్నారు?'

'ఎవరితోనూ లేదు. అసలు మాటాటమే లేదు. నేను నిదరో తున్నాను. అయామే స్లీపింగ్.'

"అందుకే వచ్చానండి మిమ్మల్ని లేపుదామని"

'ఎవరునువ్వు? అలారం టైంపీసువా. స్టుడియో గంటవా? తూతూ బాకావా? హూవార్ యూ? ఇక్కడ నీకేంపని?' అని కోప్పడ్డాడు రాజు.

'క్షమించండి నేను అసిస్టెంటు డైరెక్టర్ని. 'పైవారం మరోకథలో' వాణ్ణి. రెజ్జెల్లనుంచి మీకోసం చూసి, చూసి, ఇవతలికి వచ్చేశాను మిమ్మల్ని తీసుకు వెళ్దామని. యువర్ స్టోరీ ఈజ్ నాట్ మూవింగ్. తమరి కథ కదలటం లేదు. నాపేరు రాయుడు,' అని సవినయంగా మనవి చేశాడు రాయుడు.

'దానికీ నీకు సంబంధం ఏమిటి చెప్పు. లేపోతే డొక్క చీల్చేస్తా' అన్నాడు రాజు ఉద్రేకంగా.

నరసు కంగారుపడి, 'ఇదేటిది మద్దిన? ఆదెవడో నేనెరగను నేనెవడో—'

"అబ్బెబ్బే నీసంగతి గాదు నర్సూ. దానికీ నీకూ అంటే, నాకథ కదలడానికీ, వాడిపేరు రాయుడు అవడానికి సంబంధం ఏమిటీ అంటున్నా. అంతే."

రాయుడు వినయంగా నవ్వాడు. "క్షమించండి సార్. నాకూ మీకథకీ ఇంతవరకూ సంబంధంలేదు. నేను కొత్త కథలో వాణ్ణి అని చెప్పానుగదండి. నాకు ఇందులో పోర్షను లేకపోయినా, జరగటల్లేదని, నేనే తెగించి వచ్చాను. తమరు దయచెయ్యాలి. షూటింగ్‌కీ అన్నీ సిద్ధం చేశాం. ఆర్టిస్టులు సెట్‌మీదికి, వచ్చేసి తమరికోసం కాసుకున్నారు." అన్నాడు రాయుడు.

రాజు అద్దందగ్గరకి ఆశ్చర్యపోయి, తల దువ్వుకు వచ్చాడు.

"అయితే నాకథ ఎందుకు కదల్లేదు? ఎన్నాళ్ళనించి? ఇపుడు నేనెవర్ని?" అన్నాడు సిగరెట్టు ముట్టించి.

రాయుడు మనవి చేశాడు. "రెణ్ణెల్లక్రితం కాబోలు తమరు ఈ సోఫాలో కూర్చుని ఇది కలా ఇలా అన్నారు. "కాదు వల" అంటూ ఈ అమ్మడుగారు తమరి కంఠంచుట్టూ చేతులు వేశారు. ఆ దరిమెనా తమరికి బోలెడు ఆస్తి ఉందని తమరు ప్రొడ్యూసరు అనీ ఈ కథ రాస్తున్న పాసార్థిగారు హింటుకొట్టి పబ్లిసిటీ ఇచ్చారు."

"తరువాత? తరువాత?" అన్నాడు రాజు.

"తరవాతాండి. తరవాత, అంతే. మీగుట్టు తెలిసి పోడంతో, మీ దగ్గిర ఎంత డబ్బుందో అంత తెలివితేట్లూ, కరేజీ, ఇంకా బోల్డుటాలంట్లూ ఉన్నాయని మేం పసిగట్టేశాం అండి. మీసిల్కుషర్టులూ, వాచీలు జోళ్ళు కుట్టించాం. మీఫాషన్ చాలా బాగుందని, మిమ్మల్ని ఇమిటేట్‌చేసి మీలానే మేమూ కుట్టించుకున్నామండి. ఎలాగేనా మీఅంత ఫాషను మాకెలా వస్తుంది లెండి. మీరు హాలీవుడ్డు, స్విజ్జర్లాండూ, సోమాలీలాండూ అన్నీ టూరుచేసి, అక్కడి సినిమా ఇండస్ట్రీనీ, ఫాషన్‌లనీ చూసి స్టడీ

చేసి వచ్చినవారు గదా .... తరువాతేమో ఐదారుగురు యూరపియన్ యాక్టర్లు - ఆడయాక్టర్లన్నమాట. వాళ్ళందరూ మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటా మన్నారండి మీరేమో లక్ష్మీనరసుగారిని తప్ప ఇంకోళ్ళని పెళ్ళాడనని చెప్పి వాళ్ళని డైవర్సు చేసేశారట."

'ఓరి బాబోయ్. అంత గొప్పవాణ్ణా నేను, విన్నావా నర్సూ'

'ఓరి బాబాయ్ అని ఇంకో రెండుసార్లుకూడా అనుకోవచ్చండి మీరు. మేవంధరం మీకు వినబడేలా అంటూనే ఉన్నాం వచ్చేకథలో. మీరు అక్కడికి రాక వినబళ్ళేదు.'

"ఎందుకురాలేదు నేను. కారులేదా నాకు? డ్రైవరు సెలవు పెట్టాడా. కాల్‌షీటు ఇవ్వనన్నాడా?" అన్నాడు రాజు కోపంగా.

"అదికాదండి ఆ పాసార్థితోలుకెళ్లారు. మిమ్మల్ని—"

"ఏడీ వాడు? ఎక్కడున్నాడు.... "

"అవతలి కథలో ఉన్నారండి. మిమ్మల్ని కేకేసుకు రమ్మన్నారు."

"ఏం పొగరు?"

"మరేండి వారికి ఒళ్ళు పొగరెత్తింది స్వల్పంగా! కానీ గట్టిగా అనమోకండి ఆయనేగద మీకు డబ్బు గట్రా సప్లయి చేశాడు"

"ఏడిశాడు వాడిబొంద .... ఐనా మనలో మనమాట ఎంతేం?"

"లక్షన్నర ఉంటుందని హింటు కొట్టాడండి."

"ఓరి బాబోయ్"

"మరేనండి ఓరి బాబోయే. అధరిమేనా తవరికి ఇంటలిజెంట్సు టెయిలరింగ్ షాపులో గుడ్డలూ అవీ కుట్టించాం. ప్రొడక్షను పెట్టించి,

బల్ల, ఫాను, బెల్లు, మరతలుపు కొని తెచ్చాం. మీరిపుడు పెద్ద ప్రొడ్యూసరు."

"ఓరి బాబోయ్. పెద్ద డైరెక్టర్ని కానా?"

'పెద్ద డైరెక్టర్లు కూడానండి'

'పెద్ద యాక్టర్ని?'

'మరేండి పెద్ద యాక్టర్ని కూడా'

"ఇంకా, పెద్ద యాక్ట్రెస్సుని—అదొద్దులే. ఇంకా పెద్ద ఏమేంగా ఉండొచ్చు?"

'అన్నీనండి పెద్ద రైటరు, లైటరు, సైలరు, పైటరు, డ్రైవరు, రైడరు, రీడరు, డీలరు, లీకరు ఏదిపడితే అదేనండి.'

'స్టార్ వాల్యూ చాలా ఉందా!'

'బోల్డు'

'అయితే, నేను రేటు పెంచొచ్చుగా.'

'ఒద్దండి — యాక్టర్లు వాళ్ళంతట వాళ్ళే పెంచేశారు —'

'నాన్సెన్స్ — వాళ్ళు పెద్దవాళ్లైతే, రేటు ఎలా పెంచుతారో, నేను ప్రొడ్యూసర్ని ఐనకొద్దీ, వాళ్ళరేటు అలాగే దించుతాను. చిన్న ప్రొడ్యూసరు లక్షవేలిస్తే పెద్దవాడు యాభై వేలియ్యాలి — అంతేనా?'

'అంతేనండి కాని, నెస్టు పిక్చరులో అలా బేరం చేద్దాం. ఇపుడు వాళ్ళ రేట్లకే అందర్నీ బుక్ చేసేశాం. అందుకని వదిలెయ్యండి. అదేనా డిస్ట్రిబ్యూటరు ఇచ్చుకుంటాడు. మన సొమ్మేం పోయె. వాళ్ళని కూడా బాగుపడనియ్యండి."

"వెరీగుడ్. పడనీ ఈసారికి. అయితే ఇపుడు మనం పిక్చరు తీస్తున్నాం కదూ? పేరేమిటి?"

'ప్రొడక్షన్ నెంబరు వన్ సార్'

'స్టోరీ ఏమిటి'

రాయుడు, రాజు కళ్ళలోకి పరిశీలనగా చూసి, ఫక్కున నవ్వాడు. "పిచ్చరు తియ్యకుండా, స్టోరీ ఏమిటండీ. మీరు మరీ విట్టీగా మాటాడుతారు! భలేవారే" అనేసరికి నవ్వు పెల్లుబికి పోయింది. విరగబడి నవ్వసాగాడు.

'కట్' అన్నాడు రాజు కోపంగా.

'లైట్సాఫ్.' అని గావుకేక పెట్టాడు అసిస్టెంట్ డైరెక్టరు రాయుడు అలవాటుకొద్దీ.

కునికిపాట్లు పడుతున్న నర్సు తుళ్ళిపడింది.

"అబ్బ! యంత కేకేసినావు. నీజిమ్మడ. సచ్చినోడా" అని గొణుక్కుంది.

రాజు సిగ్గుపడి పోయాడు తన తెలివితక్కువకి. "సారీ, బ్రదర్. ఇపుడే నిద్దర్లేచాను. అందులోనూ రాత్రి సెకండ్ షో కెళ్ళాను. కాసిని అయిడియాల కోసం....ఏదో మాటజారింది....అసలు నా అయిడియా ఊరికే శాంగ్సుబుక్స్‌కి స్టోరీ రాశారా అని. అంతేగాని, పిక్చరు తియ్యకుండా స్టోరీ తయారుకాదని, ఆ మాత్రం తెలీదూ?" — అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

రాయుడు స్థిమిత పడ్డాడు. 'చెప్పేసిండి .... కాని ఓటి చెబుతా. మిమ్మల్ని పూర్వాశ్రమంలో అందరూ యూస్‌లెస్ అన్నారందుకే. అనుభవం లేదుగదా.'

"పూర్వాశ్రమా? అదేమిటి? వాడెవడు?" అన్నాడు రాజు.

"పూర్వం మీరు ఎవరండీ .... ఉత్తిన్యూటాలంటే గదా. కొత్త యువకులు. అప్పుడు మీదగ్గిరేమున్నాయి. (రేకు) పెట్టే, (సత్తు) బేడా. ఓజత చొక్కాయి లాగు. ఆశలూ, కాసిని ఆశయాలూ, వేస్టుపేపర్లూ. అంతేగా. పాసార్ది చెప్పాకనే గదా మీమెరిటు మాకు తెలిసింది. అప్పుడే గదా. హారినీ ఇంత 'గొప్ప' వాణ్ణి అలా అన్నామే అని నాలిక్కరుచు కున్నాం .... సర్లెండి కాని, స్టుడియోకి బయల్దేరండి ఆర్టిస్టులంతా కాసుకుని ఉంటారు."

రాజు గంభీరంగా ఇంకో సిగరెట్టు ముట్టించి, 'కానీ. రిహార్సల్సు పూర్తిఅయ్యేసరికి అక్కడికి చేరుకోలేమా' అన్నాడు.

రాయుడు, ఉలిక్కిపడి, తలపైకెత్తి చూసి పగలబడి నవ్వాడు. "ఏమన్నారు....రిహార్సలా? .... రిహార్సల్సేనా మీరన్నది? .... సార్. మీరు చెప్పినట్లు ఈరెండు అయిడియాలూ, ఏది, స్టోరీ, సినిమా పేపర్లకి యిస్తే, రిహార్సలు, రెండూ అయిడియాలు కళ్లకద్దుకు బాక్సులు కట్టి, లేదా బానర్లు ఇచ్చి పబ్లిసిటీ యిస్తారు అన్ని దేశాల్లోకూడా. నాకు పదో పరకో దొరుకుతుంది. ఇవ్వమంటారా?"

'ఎలారాయొచ్చో శాంపులు చెప్తా' అని గబ గబ న్యూసురాశాడు రాయుడు; హెడ్డింగు; నేటి నిర్మాతల స్థితి; దానికిందనే ఇంకో హెడ్డింగు. ఒక అమాయక నిర్మాత బూజు భావాలు. దానికింద ఈనాడు ఫిలిం ఫీల్డులోకి చాలా మంది ప్రొడ్యూసర్లు ఎంటరయిపోతున్నారు. వీరికి ఫిలిమ్మేకింగు గురించి ఏ. బి. సి డీలు కూడా తెలీవని డేర్ చేసి చెప్పొచ్చు. (అప్పచ్చిలాగ. ఇది హ్యూమరులెండి) రీసెంటుగా ఏస్ ప్రొడ్యూసరు 'డాష్' గారు ఇచ్చిన స్టేటుమెంటులో అయిడియాలు చిత్తగించండి.

"ఈ నిర్మాత మాతృడికి, పిక్చరు కంప్లీటు కాకుండానే స్టోరీ ప్రిపే (తయా) రవాలిట. కనీసం పిక్చరు ఏసబ్జట్టు (పెసరట్టులాగ) గురించో రఫ్ అయిడియా ఏనా ఉండాల్ల. (డాల్డాలాగా).

"ఇంతేకాదు. షూటింగు స్టార్ట్ కాడానికిముందు రిహార్స్‌ల్సు అనేవి వేస్తారని ఈ వెర్రిబాగుల నిర్మాత ఇనొసెంట్ అయిడియా—ఇలా బూజుపట్టిన భావాలవారు (ఆవాల్లాగా) నేటి మన నిర్మాతలు.

"ఎలా ఉందండి ఈ అయిడియా?" అన్నాడు రాయుడు ఒగురుస్తూ.

'ఏడిసినట్టుంది. ఇదిగనక ఎవడికేనా తెలిసిందో, నా కంపెనీలోనే కాదు. ఏకంపెనీలోనూ నీకు పుట్టగతుల్లేకుండా చేస్తా. కబర్దార్' అన్నాడు వరహాలరాజు కసిగా. అని 'కావలిస్తే ఆ అయిదో పదో నేనే యిస్తా తీసుకో' అని బ్రాకెట్‌లో చెప్పి, ఇంగ్లీషులో నవ్వాడు. 'ఐదో పదో కాదండీ పదో పరకో దొరుకుతుందనుకున్నాను.' అని సరిదిద్దాడు రాయుడు.

తరువాత ఇద్దరూ మరో సారి వచ్చే కథలోకి బయల్దేరారు.

రాజు వెడలె రవితేజము లలరగ, రాయుడు వెను వెంటను నడవగ.

"కారు లేకపోవడం బాగాలేదోయ్" అన్నాడు రాజు నాలుగడుగులు వేసి.

'మరేండి ఏం బాగులేదు. కొనేసెయ్యండి.'

'ఏమిటి అస్సలింకా కారే కొనలేదా నేను? ప్రొడక్షను పెట్టినా కారుకొనకపోడం ఏమిటోయ్!'

'మరేండి' అన్నాడు రాయుడు ముభావంగా.

'మాబు చేస్తారేమోనని భయంగా ఉందోయ్' అని భయపడ్డాడు రాజు పెద్దవీధిలోకి రాగానే.

'ఏమిటండీ?'

'మాబు — అదే జనం నన్ను ముట్టడించేసి ఆటో గ్రాఫులు అవీ కావాలంటారేమోనని .... వెధవది. సినిమాలో ఉంటే ఇదేచిక్కు-స్వేచ్ఛావాయువులూ గట్రా పీల్చలేం. ఎక్కడికెళ్ళినా —'

'టాక్సీలో పోదామాండి' అన్నాడు రాయుడు హఠాత్తుగా.

'పోదాం కాని నాకు సిగ్గు సుమీ. వెధవది టాక్సీ ఎక్కి సొంత ప్రొడక్షనుకి వెళ్ళడమా. షేం షేం డ్రిల్ల అంటారు .... అదేబెంగ.'

'ఏం చేస్తాం కిష్టాస్ ఫాదర్ సైజు వాడు గాడిద కాళ్ళు పట్టు కున్నాట్ట లోగడ.'

'ఇప్పుడు మనం టాక్సీకాళ్ళు పట్టుకోవాలా?'

'ఇప్పుడు అక్కర్లేదండి. దిగేటప్పుడు డబ్బుల్లేకపోతే. దానికి చాలా టైముంటుంది' అని పకపక నవ్వాడు రాయుడు.

రాజుకి నవ్వురాలేదు. ఎందుకు రాలేదన్నట్టు చూశాడు రాయుడు.

"నీకేం తెలుసోయ్ డబ్బయిపోయిన ప్రొడ్యూసరు అవస్థ. నీకు అంతా నవ్వులాటగానే ఉంటుంది. మా సమస్యలు వేరు'.

'ఓరి బాబోయ్' అన్నాడు రాయుడు మెల్లిగా.

ఇద్దరూ బస్టాండు దగ్గరకు చేరి టాక్సీ కోసం నిల్చున్నారు.

రాయుడు దీర్ఘాలోచనలో బోర్లా పడిపోయాడు. రాజు సిగరెట్టు ముట్టించి దిక్కులు చూస్తూ నిలబడ్డాడు. ప్రజాభిప్రాయం వినబడింది కొంచెం అసింటా.

'బ్రదర్ గోదాలోకి కొత్తగొడ్డు దిగిందంట విన్నావా!' అన్నాడు ఒక ప్రజ. అతనిపేరు గురువు. కాబట్టి రెండో వాడి పేరు లఘువు అయితీరాలి.

'ఏమి కథ' అన్నాడు లఘువు గుడ్లు మిటకరించి గుటకలు వేస్తూ.

"ఏమిటేమిటి! మోస్టు వండ్రఫుల్ గొడ్డన్నమాట. పేరురాజుట. సుద్ధ క్రాకు. వాడికి పిక్చర్ ఫినిష్ కాకుండా-ఆమాటకొస్తే మొదలేనా పెట్టకుండా కథ దేనిగురించో, చెప్పాలిట. ప్రాణాలు తీసేస్తున్నాట్టలే అసిస్టెంటు డైరెక్టర్లనీ వాళ్ళనీని"

'ఏవి ఓత్రం. నువ్వు మరీబడాయి. ఎప్పుడూ ఇలాటి నీలివార్తలే మోసుకొస్తావు. బుర్రున్న వాడెవడైనా నమ్ముతాడా?' అన్నాడు లఘువు తిప్పుకుంటూ.

గురువు నిట్టూర్చాడు. "రైటే బ్రదర్. నమ్మడం కష్టమే. కాని అలా లఘుప్రగా కొట్టెయ్యకు. కావాలంటే ఇంకోటి చెబుతాను. రిహార్సలు వెయ్యమంటాట్ట. ఇది చాలా?"

'హరహరా' అన్నాడు లఘువు చెవులుమూసుకుని.

'రాయుడూ విన్నావా?'

'విన్నా.'

'మన్నా?'

'ఔనన్నా.'

'అన్నన్నా. ఎంతచిత్రం. ఎలా తెలిసింది అప్పుడే? ఇప్పుడేగా? మనం అనుకున్నాం.'

"దేగాలేదు కాకీలేదు సార్. దాని సంగతి అంతే. పుకార్లస్పీడు అలాగే ఉంటుంది."

రోడ్డుమీద అటూ యిటూ పోయే కార్లలో వాళ్ళంతా, వీళ్ళవంకే చూసి ఫక్కున నవ్వుకుంటున్నారు.

'ఊరంతా తెలిసిపోయిందే.'

'అట్టుడికినట్టుడికి పోతోంది.'

'హా చంద్రమతీ'

'ఏదిగతి! బై ది బై ఎవరావిడ, యడ్రసేమి'

*　　*　　*　　*

'టాక్సీరాలేదు. బస్సెక్కుదామండి.'

'కానీ.'

'కానీ ఏమిటి మళ్ళీ. ఏం సందేహం?'

'అబ్బే. సరే కానిమ్మన్నాను.'

'ఎందుకు మీదగ్గిర లేవా కాన్లు?'

'నీక్కావాలా?'

'నాక్కాదు. మీక్కావాలేమోనని కానిమ్మంటున్నారు గదా.'

'అదా. మరీబడాయి నువ్వు. ఏం తెలీనట్టే.'

'ఒట్టు'

'బస్సొచ్చింది ఎక్కు.'

*　　*　　*　　*

'ఇక్కడే దిగండి. ఈ కాణ్ణుంచి, అరమైలు నడవాలి.'

'వాలి అంటే గుర్తొచ్చింది. వాలి సుగ్రీవ సజ్జట్టు ఎలా ఉంటుంద దోయ్ రాయుడూ?'

'బ్రహ్మాండంగా ఉంటుందండి. కాని చాలా డబ్బవుతుంది. సెట్టింగులూ, కాస్ట్యూములూ, పెద్ద ఆర్టిస్టులూ కావాలి.'

'దానికేముంది. వాలికీ వాడి ఆలికీ బాక్సాఫీస్ స్టార్లని పెడదాం. మిగతా రోల్సుకి, చిన్నవాళ్ళని, కొత్తవాళ్ళనీ వేసుకుందాం. రోలుకో వంద ఎడ్వాన్సు పుచ్చుకోవచ్చు. బ్లాక్‌లో 50 అడుగుదాం' అన్నాడు రాజు ఉత్సాహంగా.

'నాకు ఆశ్చర్యంతో ఏం మాట్లాడ్డానికీ తోచటంలేదు సార్, అంచేత నేనేం మాట్లాణ్ను. మీరు చెప్పుకుపోండి' అన్నాడు రాయుడు ఆశ్చర్యంతో.

రాజు సంబరపడిపోయాడు. 'చెప్పేందుకేముంది. మనం ఎంత సేపూ, ఆర్టుకి అన్యాయం చెయ్యకుండా, జాగ్రత్తగా వాలి కథను వాల్మీకి రాసినట్టు తీసిపారేస్తే, పిక్చరులో సెట్లు, గిట్లూ, స్టార్లూ, గీర్లూ, లేకపోయినా, చచ్చినట్టూ హిట్టయి ఊరుకుంటుంది. సింపుల్' అన్నాడు.

రాయుడు ఈసారి తేలుకుట్టినట్టు తుళ్ళిపడ్డాడు.

'వాట్‌సార్. మీరు మరీ ఔత్తిగా ఇంత అమాయకులు అనుకోలేదు. వాల్మీకీ వాళ్ళ ఫిలిం కథలకన్న డ్రామెటిక్ రాస్తారని వాపించే గుంపులో కలిసిపోతే, మీకు భవిష్యత్తులేదు. అసలు వాళ్ళకి ట్రీటుమెంటూ అదీ ఎలా తెలుస్తుందండి. అప్పటికి ఫ్రాయిడ్ పుట్టనేలేదు. సైకాలజీ అనేమాటే వినుండరు వాళ్ళు. అదే తెలీపోతే, ట్రీటుమెంటేం చేస్తారు. వాళ్ళని తప్పట్టడం లేదు సుమండి. మీకు స్టుడియోలో ఇద్దరు ముగ్గుర్ని పరిచయం చేస్తాను. వాళ్ళు చెప్తారు మీకు వాలికథ ఎలా తియ్యాలో. అంతేగాని సొంతంగా మీరు ఇందులో దిక్కండి. దెబ్బ తినేస్తారు. ఇదేం ఆర్టా మజాకానా. ఇలా అన్నానని కోప్పడకండి. మీతమ్ముళ్లాంటి వాణ్ని. మీరు నన్ను పైకితేవాలి. అసలు ఐ లవ్ ఆర్ట్. వెధవది అదేమిటో చిన్నప్పణ్ణించీ అంతేనుట నేను. పుప్పుపుట్టగానే

పరిమళిస్తుందనుకో వచ్చనుకోండి. అయితేమటుకు నేను మరీ అన్యాయంట. చదవరా నాయనా అని మానాయనా ఆయన నాయనా జాయింటుగా గోలెత్తినా, నేను అర్టోయ్ అని పొద్దస్తమానమూ ఒకటే గోలట. దానికోసమే మావూళ్లో నిరుద్యోగం, ఈ వూళ్లో మా ఫ్రెండు రాలీసైకిలూ త్యాగంచేసి, ఇలా బతికున్నాను. నాకే డబ్బుంటేనా, పెద్ద డైరెక్టర్నయి పోయేవాణ్ణి" అన్నాడు రాయుడు ఆయాసపడుతూ.

"మరేం ఫరవాలేదు. ఇప్పుడొదుగాని 'వాలిసుగ్రీవ' పిక్చరు నీకేయిస్తాను. డోంట్‌వరీ. ఆర్టంటే పడి చచ్చే వాళ్ళంటే పడి చచ్చే వాళ్ళలో నేనొకణ్ణి."

"బావుందండి మీరు ఒక్కరు కాకపోతే ఇద్దరెలా అవుతారు. వచ్చేశామండి స్టుడియోకి. ఇక్కడ ఇద్దరు ముగ్గుర్ని పరిచయం చేస్తాను" అన్నాడు రాయడు.

*　　　*　　　*　　　*

"అయామే గ్రేట్ షోమన్" అన్నాడు ఇద్దరు ముగ్గురు.

'నాది పూర్తిగా ఎంటర్టెయిన్ మెంటాలిటీ అండి. ప్రజల పావలా అర్థణాకీ, మొహం మొత్తిపోయి, మోము తీపెక్కేదాకా ఎంటర్టెయిన్ మెంటు పెట్టేస్తాను. అయామే జీనియస్ అని, నా అసిస్టెంట్లూ, బంట్లూ అంతా అంటారు. నావెనకేకాదు. ఎదటకూడా ఆముక్కే నిర్భయంగా చెప్పేస్తారు. ఎండ్ ఐలైక్ ఫ్రాంక్ నెస్. నిర్మొహమాటంగా కుండ బద్దలు కొట్టినట్లు నిజం మాట్లాడే వాళ్ళంటే ప్రాణం పెడతాను,' అన్నాడు ఇద్దరు ముగ్గురు ఇంకోక్షణం ఆగి.

"సరే అయితేమీరు వాలిసుగ్రీవ ఎంటర్టెయిన్ మెంటాలిటిగా ఫిలిం తీస్తారా" అని నిర్మొహమాటంగా మొహంపెట్టి అడిగేశాడు రాజు.

'తీస్తాను' అని అంతకన్న నిర్మొహమాటంగా చెప్పేశాడు ఇద్దరు ముగ్గురు.

'నాకు నిర్మోహమాటం అంటే చాలా యిష్టం. పడిచస్తాను' అన్నాడు రాజు.

'నేనూ అంతే....మనిద్దరికీ స్పిరుచువల్ గా అంటే ఆధ్యాత్మికంగా ఏకాభిప్రాయం కుదిరిందన్న మాట. ఇంక అన్ని అభిప్రాయాలూ ఒకటే. అంచేత మనము తీసే పిక్చరు —'

రాజు మెల్లిగా రాయుడు వేపు జరిగి—'ఏమిటంటాడు?' అన్నాడు.

ఇద్దరు ముగ్గురు ఆ మాట విన్నారు. విని నవ్వారు. 'స్పేర్ టైములో — అంటే తీరిక వేళల్లో నేను అబిసీనియన్ ఫిలాసఫీ చదువు తాను లెండి. అది నా హాబీ.'

'అయ్య బాబోయ్' అన్నాడు రాజు.

'ఔనండి. నేనసలే ఇంటలెక్చువల్ ని. దానికి తోడు మాడప్టి జాస్తి. నాకు ట్రాజడీ మృత్యువు. చీకటి, శ్మశానం, ఆకుజోళ్ళు, చాలా యిష్టం. ఈ సంగతి 'సినిమార్ పేపర్' నించి నన్ను ఇంట్రవ్యూ చెయ్య వచ్చిన అతను కూడా చెప్పాడు. ఈ ఐదు సబ్జెక్టుల మీద నేను డబుల్ డబుల్ వాల్యూమ్ క్యాలికో బైండు బుక్కులు రాస్తున్నాను. ఋషులా బిమల్ రాయ్ కి వాటిలో ఓదాన్ని, శాంతారాంకి వాటిలో ఇంకోదాన్ని, ఫిలిం తియ్యమని ఇస్తానని తెలుస్తోంది. వరల్డ్ రైట్సు నారూములోనే ఉంటా యనుకోండి. ఇందాక నేం చెప్తున్నానూ?....మర్చి పోయాను ఐ ఫర్గాట్. నాకిదో జబ్బండి. ఈ ఫర్గాటింగు....నాకు మరుపు ఉందన్న మాట కూడా మర్చిపోతాను. అప్పుడప్పుడు హాయ్ .... హవ్వ .... ఆబశింతలు — శిద్ధ డొస్తోశికాబోళు .... హాయ్.'

"మీరు వాలి సుగ్రీవ తీస్తానన్నారు" అన్నాడు రాజు — దొరికిన ఛాన్సు పదల కూడదని.

'హమ్మయ్య వాలి సుగ్రీవకదూ, యస్. అది నా స్పెషల్ సబ్జెక్టు మీరు యెవర్నడిగినా నా దగ్గరకే పంపిస్తారు. ఓటోక్లాసులోంచే అది

ఫిలిం తీస్తాననేవాణ్నట .... బాయ్. ప్రొడ్యూసరుగారు డబ్బులిస్తారుగానీ, గెట్ గుడ్ కాఫీ, ఓ గోల్డ్‌ఫ్లాక్ పెట్టికూడా .... వాలి కథలో తమాషా ఏమిటంటే....మీదగ్గిరో సిగరెట్టుందా .... వాడికీ రావణుడికీ ఒక కామన్ పోలిక .... ఏమిటిది .... చార్మినారా, ఐ లఫిట్ నాకు బలేయిష్టం .... చార్మినారుకీ, రావణుడికీ, అయి మీన్ వాలికీ, పోలికేమంటే, — ఒక సైకాలజీ వుందండి. మీరు ఎప్పుడేనా చూశారో లేదోగాని ఇప్పుడు రావణుడున్నాడా చిన్నప్పట్నించీ హివాజ్ లవింగ్ దట్ గర్ల్ సీతా. ఆమాట కొస్తే పూర్వజన్మంనించీ అనాలి అంటే, సీత ప్రీవియస్ బర్త్ అన్నమాట. ఏం అలాంటపుడు అతను ఎంత బాధపడతాడు? వాడూ హ్యూమన్ బీయింగే. మానవ మాత్రుడే. వాడిలోను బ్లడ్ పరుగెడుతోంది. అయినపుడు దిస్ యంగ్ డెవిల్ అనేరామా—ఈ రాములవారు వచ్చి ఆపిల్లని చటుక్కున పెళ్ళాడేశాడు ఏం?"

"వాలికథ" అన్నాడు రాజు భయపడుతూ.

'వస్తున్నా అయామ్ కమింగ్. ఇదంతా వాలి సైకాలజీయేగా .... అంచేత నాచురల్లీ రావణాగాట్ యాంగ్రీ .... సో, హి స్టోల్ సీతా. ఆ పిల్లని దొంగిలించాడు. వాలికేసు కూడా దాదాపు యింతే. దీనికి పార్లర్‌గా ఉంది. ఇతను కూడా చిన్నప్పట్నించి, రుమని లవ్‌చేసి ఉండాలి. అందు కని పొలిటికల్‌గా, రాజకీయంగా, అల్లకల్లోలాలూ అపార్థాలూ వచ్చి నపుడు, హిమేడ్ గుడ్. బ్రదర్‌ని తరిమివేసి రుమని కాజేశాడు. రాము డొచ్చినపుడు సుగ్రీవుడు అడగ్గానే ఎందుకు సాయం చేస్తానన్నాడు? జస్ట్ ఫర్ దిస్ రీజన్. ఇదే కారణం. తన భార్యని రావణుడు ఎత్తుకు పోయాడు గదా. అలాగే, సుగ్రీవుడి పైఫుని వాలి చెక్కేశాడు. అదీ మెయిన్ రీజన్. ఆ బాధ తెలుసు కాబట్టే సుగ్రీవుడికే సాయం చేశాడు. ఇంకోటి. రాముడు వాలిని చంపగానే మనం ఆసీను కట్‌చేసి రావణా సురుడి సభని చూపించాలి. ఇలా ఈ బాణం తగిలి వాలి నేల కూలగానే అక్కడ రావణాసురుడి చేతిలో వైన్‌గ్లాసో ఏదో జారి పడి పోవాలన్న మాట. పెద్ద బాగ్రౌండ్ మ్యూజిక్. సిక్స్టీ డ్రమ్స్. థర్టీఫోర్ వైలిన్సూను. కామెరా సీతమీదకి పాన్. మళ్ళీ రావణుడి మీదికి కట్.

టిల్ట్‌షాట్. క్లోజప్, 'ఏమిటీ యపశకునము' అని డైలాగు. బ్రీఫ్‌గా, పవర్‌ఫుల్‌గా. ఈ ఇన్సిడెంటు రావణుడి భవిష్యత్తుమీద ఫోర్కాస్టులాటి దన్నమాట. దీన్ని మనం బాగా ఎక్స్‌ప్లాయిట్ చేస్తే షాట్సు పడిపోతా యంతే. మన రామాయణం అపూర్వం, అనుత్తరం అయిపోతుంది." అని ఆగాడు. ఇద్దరు ముగ్గురు రాజు మాట్లాడ్డానికి ఛాన్సు ఇచ్చి.

ఒక నిముషంలో రాజు కోలుకున్నాడు. "మరి మనం తీస్తున్నది వాలిసుగ్రీవ కథ కదండి. వాలి బ్రదర్‌కి పోర్షన్ ఉన్నట్టు లేదే .... మీరు చెప్పేది రామాయణం ట్రీట్‌మెంటులావుంది."

ఇద్దరు ముగ్గురు జాలిగా నవ్వి, రాజు భుజం తట్టాడు. 'మరేం భయపడకండి. వాలి కథే తియ్యాలని మనకి శాసనం ఏమిటి. ఎవడా శాసించే వెధవ. డొక్కచీల్చి డోలుకట్టి ఆర్కెస్ట్రాలో పెట్టిస్తాను. అంతగా మనం తీసేది చివరికి రామాయణంగా తయారైతే పేరు మార్చేద్దాం. రామాయణం అనే పిలుద్దాం. వాటీజ్ దేర్. వాటీజినే నేమ్. నాకు పేర్లలో నమ్మకంలేదు. అయామ్ ది గ్రేటెస్ట్ షోమాన్. నా అసిస్టెంట్లన్నట్లు. ఆల్మోస్ట్ ఏ జీనియస్. పూర్తిగా జీనియస్‌నని పబ్లికున ఒప్పేసుగోపోడానికి కారణం మాడేస్టీయేనంటే నమ్మండి. నిర్మొహమాటం అంటే ఉన్న అభిమానంకొద్దీ ఈ కాస్తేనా చెబుతున్నాను .... ఇప్పుడు చూడండి నేను వాలికథ మొదలుపెట్టి రామాయణంలోకి జారిపోయానంటే, ఎంత పరాకో మీరే చూసుకోండి. ఎవడేనా అలా చేస్తాడా అని. అసలు రామాయణానికీ వాలిసుగ్రీవులకీ ఏమైనా సంబంధం ఉందా. అదేమిటి? వీళ్ళెవరు? అయినా నేను పరాకున ఇందులోకి జారిపోయేనంటే, జీనియసువల్ల వచ్చేనష్టం మీరు గ్రహించగలరు."

"అదేమిటిసార్ అలా అంటారు. వాలి సుగ్రీవులకీ రామాయణానికీ సంబంధం లేపోతే ఇంకేముందండి" అన్నాడు రాజు కొంచెం తటపటాయించి.

ఇద్దరు ముగ్గురు మళ్ళీభళ్ళున నవ్వాడు. 'అదటయ్యా మాట। సంబంధం లేదంటే లేదనా. అన్నిట్లో అందరికీ ఎప్పుడూ ఏదో ఓసంబంధం ఉంటూనే వుంటుంది. రామాయణానికీ భారతానికీ వుంది; దానికీ హామ్లెట్‌కీ వున్నది. దానికీ ఇంకా ఏదిపడితే దానికీ సంబంధం ఉంది. రేపు మనం వాలి స్టోరీని తీసినపుడు ఫ్లాష్‌బాక్‌లో భారతయుద్ధం, హామ్లెట్‌లో ఘోష్టుసీను చూపిస్తామా లేదా."

'చూపిస్తామనుకోండి' అన్నాడు రాజు భయపడుతూ గుటకవేసి.

'ఇంకేం. అలాటప్పుడు. మరి వాటికి సంబంధం లేదనగలమా.'

'అనలేమనుకోండి' అన్నాడు రాజు నసుగుతూ.

'అయినా రామాయణాన్ని 'ఆది కావ్యం' అంటారని మా మేష్టారు అన్నాడు.'

'హోస్. అదా నువుచెప్పేది. అది రైటైతే కావచ్చు. అంటే, రామాయణం ఫస్టున పబ్లిషు అయినట్టుంది. కానీ భారతమే ముందు జరిగినట్టు నాకుగుర్తు. ఇంక హామ్లెట్టంటావా అది చాలా పాతది. వీటికన్న ముందరదని మొన్న ఒక సీమ దొర కూడా చెప్పాడు. ప్రింటు కావదానికి చాల రోజులు ముందర్నించీ, దాన్ని డ్రామా ఆడేవారుగదా. అయినా మనం ఓపని చెయ్యొచ్చు. పెద్ద బాక్సాఫీస్ అయిడియా. ప్రొడక్షనుతో పాటు మనం ఓ పేపరు మొదలెడదాం. అందులో ఓ కాంట్రవర్సీ. వాద ప్రతివాదన వేదిక అని దానికి హెడ్డింగు'

'ఏదిముందు? హామ్లెటా, రామాయణావా. ది మహా భారటావా? ఏది ముందు జరిగింది? ఏది ఫస్టున పబ్లిషుఅయింది? అని నోటీసు వేదాం. ఇందులో బయటపడే ట్రూతుని మా మహత్తర పౌరాంఘిక చిత్రము వాలి సుగ్రీవలో చేర్చుతాము అని కూడా బెదిరిద్దాము. అక్కడితో జనం దీని మీద కొట్టుకు ఛస్తారు. ప్రజలుట్టి వెర్రి వెధవలు. గొర్రెల మంద సైకాలజీ. ఇటు మాంఛి పబ్లిసిటీ; పిక్చరు గారంటీ హిట్టు. సరేనా?"

'సరేండి' అన్నాడు రాజు బిక్క మొహం పెట్టి.

'మీరు థల్‌గా ఉన్నారు. ఏది ఓ హండ్రెడు ఇలా పారెయ్యండి.'

'నో సార్. హండ్రెడ్ ఈజే బాంక్ అయామే చెక్. టుమారో మార్నింగు కాష్' అన్నాడు రాజు.

"వెరీగుడ్ సో. ఈపిక్చరు నాకిస్తారుగా" అన్నాడు ఇద్దరు ముగ్గురు.

'ఎంత మాటండి' అన్నాడు రాజు నవ్వి.

'మీరు చాలా అన్యాయం చేశారు. డైరెక్షను నాకే ఇస్తానని ముందర చెప్పి, తీరా వాడికి మాటిచ్చారు' అన్నాడు అసిస్టెంట్ డైరెక్టరు రాయుడు కోపంగా, బాధగా.

'మాటేగదోయ్' అన్నాడు రాజు ఆరుబయట గాలి పీల్చి హమ్మయ్య అనుకుంటూ.

'ఏమోనండి మా మామయ్య పోయెం గ్నాపకం వస్తోంది 'క్షణక్షణముల్ ప్రభు దివ్యచిత్తముల్' అని అన్నాడు రాయుడు దిగులుగా.